
పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్


నేతాజీనగర్‌లో..


తారానగర్ పోచమ్మ ఆలయంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రవికుమార్ యాదవ్‌లను సన్మానిస్తున్న దృశ్యం

ఊరూ వాడా సంబురం

ఘనంగా బోనాల పండుగ | ఉదయం నుంచే ఆలయాల్లో భక్తుల సందడి | ప్రతి ఇంట్లోనూ సందడి మొక్కులు తీర్చుకున్న మహిళలు

బోనమెత్తిన శేరిలింగంపల్లి మహిళలు

శేరిలింగంపల్లి జోన్ బృందం: తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకైన బోనాలు భక్తిశ్రద్ధలతో ఆదివారం వాడవాడలా ఘనంగా జరిగాయి. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధి లోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్లలోని కాలనీలు, బస్తీల్లోని అమ్మవారి ఆలయాలు ఉదయం నుంచే భక్తులతో కిటకిటలాడాయి.

ప్రతి ఇంటి నుంచి మహిళలు భక్తిశ్రద్ధలతో బోనమెత్తి అమ్మ వారికి మొక్కులను తీర్చుకున్నారు. దీంతో ప్రతి ఇంట్లోనూ పండుగ వాతావరణం కనిపించింది. పోతరాజుల విన్యాసాలు, శివ సత్తుల సందడి ప్రత్యేక ఆకర్షణలుగా నిలిచాయి.

అమ్మవారి ఆలయాల ముస్తాబు

బోనాలను పురస్కరించుకుని అమ్మవారి ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. శనివారం సాయంత్రం నుంచే ఆలయాలను పూలు, మామిడాకులు, వేపమండలు, విద్యుత్‌దీపాలతో ప్రత్యేకంగా అలంకారం చేశారు. కొన్ని చోట్ల అమ్మవారి ఆలయం వెలిసిన వీధులనే విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆదివారం ఉదయం నుంచి భక్తుల రాకతో ఆలయాలన్నీ కిక్కిరిసిపోయాయి.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని పోచమ్మ, కాళికాదేవి, భవానీమాత, మైసమ్మ, రేణుకా ఎల్లమ్మ, ఊరపోచమ్మ, బంగారుమైసమ్మ, ఈదమ్మ, మరియమ్మ, రాజరాజేశ్వరి మాత, అన్నపూర్ణాదేవి తదితర అమ్మవార్లకు ప్రత్యేకంగా పూజలు, అర్చనలు, అభిషేకాలు చేసి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఇంటింటి నుంచి అమ్మవారికి తీసుకొచ్చిన బోనాలను సమర్పించి భక్తులు తమ మొక్కులు తీర్చుకోవడం కనిపించింది. ఆలయాలకు ప్రజా ప్రతినిధులు, రాజకీయనాయకులు, కాలనీ, బస్తీ ప్రముఖులు, స్థానికులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.


దీప్తిశ్రీనగర్ కాలనీలోని కట్టమైసమ్మ ఆలయంలో..


అంజయ్యనగర్‌లో..


రాయదుర్గంలోని అమ్మవారి ఆలయానికి వెళ్లే దారిలో..


చందానగర్ బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి


గోపన్‌పల్లిలోని అమ్మవారి దేవాలయంలో..


కొత్తగూడలో..


శేరిలింగంపల్లిలో పోతరాజు విన్యాసాలు


తారానగర్‌లో..

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం


సదస్సులో పాల్గొన్న మిస్ గ్లోబ్ ఇండియా ఐశ్వర్య పాతపాటి

గచ్చిబౌలి: నిత్యం వ్యాయామం చేస్తే ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని మిస్ గ్లోబ్ ఇండియా–2023, రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్ ఐశ్వర్య పాతపాటి అన్నారు. ఆదివారం గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రిలో వరల్డ్ హెపటైటీస్ డేను పురస్కరించుకుని హెపటైటీస్, ఫిట్‌నెస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవన శైలిలో చిన్న మార్పులు చేసినా మంచి మార్పును చూడవచ్చన్నారు. కేర్ హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సునీత అగర్వాల్ మాట్లాడుతూ హెపటైటీస్ కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఏటా వేలాది మంది మరణిస్తున్నారన్నారు. కాలేయ ఆరోగ్యాన్ని తెలుసుకోవడానికి కేర్ హాస్పిటల్ స్క్రీనింగ్ ప్యాకేజీని అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ ఆశా సుబ్బలక్ష్మి మాట్లాడుతూ ఐదు రకాల వైరస్‌ల వల్ల హెపటైటీస్ సోకుతుందన్నారు. వ్యాక్సిన్‌ల ద్వారా హెపటైటీస్ బీ,డీ నయమవుతందని, హెపటైటీస్ సీ మందుల ద్వారా నయమవుతందన్నారు. కలుషిత నీరు, ఆహారం ద్వారాహెపటైటీస్ సోకే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జి.స్వాతి, వివిధ కంపెనీల ఉద్యోగులు పాల్గొన్నారు.

రేపు 'డయల్ యువర్ డీఎం'

జీడిమెట్ల: ఈ నెల 30న 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు జీడిమెట్ల డిపో మేనేజర్ ఆంజనేయులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా డీఎం నంబర్‌కు 9959226150 ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఆర్టీసీ ప్రజలకు మరింత చేరువు అవుతుందని డీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

ఘనంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ డివిజన్ వినాయకనగర్‌లోని ఈదమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత రెండు రోజులుగా జరుగుతున్న పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉదయం అశ్విని నక్షత్రంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలను అర్చకులు, వేద పండితులు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజల్లో పాల్గొన్న కేంద్ర మంత్రిని, ఆలయ దాత చింతల రామచంద్రారెడ్డిని బస్తీవాసులు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నేతలు సంపంగి కిరణ్, రామకృష్ణారెడ్డి, వీరేష్, శ్రీశైలం, వి.రాములు, వల్లపు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసం

వెంగళరావునగర్: యువతిని ప్రేమపేరుతో మోసగించి నగదు, నగలు కాజేసిన యువకుడిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. ఖమ్మం జిల్లాకు చెందిన యువతి 2019లో బిటెక్ పూర్తి చేసి నగరంలో ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు కార్యాలయంలో పనిచేసింది. పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన సాయిచంద్ర అతని స్నేహితుడు ప్రసాద్ ఓ ప్రైవేట్ కార్యాలయాన్ని ప్రారంభించగా సదరు యువతి 2022లో ఆ ఆఫీస్‌లో చేరింది. నెల తర్వాత సాయిచంద్ర ఆమె ప్రేమించానని చెప్పడంతో ఒప్పుకుంది. అనంతరం ఆమె నుంచి రూ. 2 లక్షల నగదు, బ్రాస్లెట్, చైన్, ఆమె క్రెడిట్ కార్డు మీద రూ. 8 లక్షలు తీసుకున్నాడు. తిరిగి తన డబ్బులు తనకు ఇవ్వమనగా ఇద్దరూ దిగిన ఫొటోలు బంధువులు, స్నేహితులు, సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు. దీంతో మోసం చేసిన సాయిచంద్రపై మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఎడ్వర్డ్ జెన్నర్ సేవలు ఎనలేనివి


కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ రమేష్‌కంచర్ల, డాక్టర్ విక్రమ్ వెంకటేశ్వరన్, డాక్టర్ ప్రణతిరెడ్డి తదితరులు

రాయదుర్గం: ప్రపంచంలో దాదాపు నిర్మూలించిన ఏకైక వ్యాధి మశూచి అని రెయిన్ చిల్డ్రన్స్ ఆస్పత్రి సీఎండీ డాక్టర్ రమేష్ కంచర్ల అన్నారు. ఆదివారం నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని షరటాన్ హోటల్‌లో రెయిన్ బో చిల్డ్రన్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో అడల్ట్ వ్యాక్సినేషన్ ఔట్‌రీచ్ నెట్‌వర్క్(ఏవీఓఎన్) కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మశూచి వ్యాక్సిన్ ద్వారా ప్రపంచంలో లక్షలాది మంది ప్రాణాలను కాపాడేందుకు కారణమైన డాక్టర్ ఎడ్వర్డ్ జెన్నర్ సేవలను వైద్యరంగం ఎప్పటికీ మరువదన్నారు. ఒక సమగ్ర ప్రాజెక్ట్, నిబద్ధత, అంకితభావం ద్వారా రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆస్పత్రి దేశంలో వ్యాధి భారాన్ని తగ్గించగలదని తాను భావిస్తున్నట్లు తెలిపారు. వయస్సుతో పాటు రోగనిరోధక శక్తి తగ్గుతుందన్నారు. అందువల్ల పెద్ద వయస్సు వ్యక్తులు ఏటా టీకాలు వేయించుకోవాలని సూచించారు. కోవిడ్–19 మహమ్మారి సమయంలో సామూహిక టీకా కార్యక్రమాల ద్వారా రెయిన్‌బో ఆస్పత్రి తమ సామర్థ్యాన్ని, నిబద్ధతను చాటుకుందన్నారు. అనేక మంది శ్రేయోభిలాషులు, ఫార్మా కంపెనీలు, కార్పొరేట్లు, పెద్ద ఎత్తున వయోజన వ్యాక్సినేషన్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించాలని కోరుతున్నామన్నారు. ఫైజర్, సనోఫీ, సీరమ్ ఇనిస్టిట్యూట్‌లతో కలిసి ప్రజలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించడం కోసం ఏవీఓఎన్‌ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. రెయిన్ బో చిల్డ్రన్స్ ఆస్పత్రి ఇంటెన్సివ్ కేర్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఒక అధ్యయనం ప్రకారం భారతీయ వయోజనుల్లో 2/3 వంతు మందికి అడల్ట్ వ్యాక్సినేషన్ గురించి తెలియదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విక్రమ్ వెంకటేశ్వరన్, డాక్టర్ విజయ్, రతన్‌జలాన్, డాక్టర్ ఐశ్వర్య, డాక్టర్ సంతోష్ తార్, పూజా దారువాలే, డాక్టర్ ప్రమోద్ పూజారి తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన కారు


అదుపు తప్పి పల్టీ కొట్టిన కారు

మణికొండ: కారు నేర్చుకునే క్రమంలో రోడ్డుపైకి వచ్చిన ముగ్గురు మైనర్లు కారు అదుపుతప్పడంతో రోడ్డు పక్కన గుంతలో పడిపోయిన సంఘటన నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లిలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శేరిలింగంపల్లికి చెందిన ముగ్గురు మైనర్లు కారు నేర్చుకునేందుకు వట్టినాగులపల్లి వైపు వచ్చారు. శ్రీదేవి ఇంజనీరింగ్ కళాశాల ముందు రోడ్డు ఖాళీగా, పెద్దగా ఉండటంతో అది అదుపు తప్పింది. రోడ్డు పక్కకు వెళ్లి గోతిలో పల్టీ కొట్టింది. అందులో ఉన్న ముగ్గురికి ఎలాంటి గాయాలు కాకపోవటంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఇలాంటి సంఘటనలపై పోలీసులు కఠినంగా చర్యలు తీసుకోవాలని వట్టినాగులపల్లి వాసులు కోరారు.

మురుగు సమస్యను పరిష్కరించండి


దీప్తిశ్రీ నగర్ కాలనీలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

అటెన్షన్ ప్లీజ్..

మియాపూర్: చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీ నగర్ కాలనీలో పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్థంగా మారింది. ఒకవైపు రోడ్లపై మురుగు, మరోవైపు చెత్త చెదారంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజుల తరబడి చెత్తను తరలించక పోవడంతో చెత్త పేరుకుపోయి వర్షాలు పడి దుర్వాసన వెదజల్లుతోంది. అదేవిధంగా విద్యుత్ తీగల కోసం నరికిన కొమ్మలను ఎక్కడపడితే అక్కడ వేసి వదిలేశారు. రోడ్డుపై మురుగు నీరు నిలిచి పోవడంతో పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.


రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

సమస్యల్లో సర్కారు కాలేజీ..!

- రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వసతులు కరువు
- పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య.
- పస్తుత విద్యా సంవత్సరంలో 430 మంది చేరిక
- సరిపడని తరగతి గదులు, ల్యాబ్‌లు
- విద్యార్థులు, అధ్యాపకుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు


రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ మధురానగర్‌లోని రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యల్లో కొట్టుమిట్టాడుతోంది. కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు, అధ్యాపకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏటా కళాశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నా.. అందుకనుగుణంగా తరగతి గదులు, ల్యాబ్‌ల సంఖ్య పెంచక పోవడంతో ఉన్న వాటితోనే సర్దుకుపోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయమై పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు అందించినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని వారు కోరుతున్నారు.

- 2024–25 విద్యా సంవత్సరంలో 430 మంది విద్యార్థులు అడ్మిషన్ తీసుకున్నారు.
- గతేడాది చేరిన 450 మంది సెకండియర్‌కు ప్రమోట్ కాగా ప్రస్తుతం ఫస్టియర్, సెకండియర్ విద్యార్థుల సంఖ్య 880 చేరింది.
- కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ ఆంగ్ల, తెలుగు మీడియం, ఒకేషనల్ కోర్సుల్లో ఏటా విద్యార్థులు చేరుతున్నారు.
- 50 మందితో ప్రారంభమైన కాలేజీలో ప్రస్తుతం 880 మంది విద్యార్థులు ఉండడంతో విద్యా కమిటీ సంతోషం వ్యక్తం చేస్తోంది.

మరో 2 తరగతి గదులు.. 4 ల్యాబ్‌లు అవసరం..

- మధురానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రస్తుతం 8 తరగతి గదులు ఉన్నాయి.
- ఇంకనూ అదనంగా రెండు తరగతి గదులు, నాలుగు ల్యాబ్ భవనాల నిర్మిస్తే విద్యార్థులకు మేలు చేకూరే అవకాశం ఉంది.
- ప్రతి కోర్సులో 100 మంది విద్యార్థులకు అవకాశం కల్పించడంతో తరగతి గదుల కొరత, వారికి కల్పించాల్సిన సౌకర్యాలు సమస్యగా మారింది.
- అంతేకాకుండా కళాశాల చుట్టూ ఉన్న ప్రహరీ ఎత్తును పెంచాల్సిన అవసరం ఉంది.
- కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు చేరువలోని రాయదుర్గం విద్యా కమిటీ చొరవపై ఐటీ సంస్థలు, కొమిరిశెట్టి, స్నేహ ఫౌండేషన్, ఎన్ఆర్ఐ సహకారంతో పలు సౌకర్యాలు కల్పించారు.

కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని విన్నపం..

- మధురానగర్‌లోని రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని రాయదుర్గం విద్యా కమిటీ బృందం కోరింది.
- ఈ విషయమై 2 రోజుల క్రితం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీని బృందం కలిసి విన్నవించింది.
- రాయదుర్గం జూనియర్ కళాశాలలో పూర్తిస్థాయి మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీనిచ్చారని సభ్యులు తెలిపారు.

చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి

గచ్చిబౌలి: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 25న కొండాపూర్ శ్రీరాంనగర్ కాలనీలో గుర్తు తెలియని వ్యక్తి(70) అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అతడిని కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో తరలించారు. అతడి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి సంబంధీకులు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.